నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | సోమవారం 29 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## జెండా ఎగరేశారు.. ఆపై మరిచారు

**మంచిర్యాల మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం**

మంచిర్యాల, జనవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపాలిటీ అధికారులు జాతీయ జెండాను తీవ్రంగా అవమానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సూర్యాస్తమయంలోగా జెండాను దించాల్సి ఉండగా, సిబ్బంది అలాగే వదిలేశారు. జెండా ఎగరేసి మూడు రోజులవుతున్నా దింపక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ పతాకాన్ని అవమానపరచిన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



మూడు రోజుల క్రితం ఆవిష్కరించిన జాతీయ పతాకం

## 55 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

కాగజ్‌నగర్‌టౌన్, జనవరి 28 : పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల (ఎస్పీయం)కు చెందిన 1968-69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శని, ఆదివారాల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో రెండు రోజుల పాటు ఆనందంగా గడిపారు. 55 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. గురువులు లక్ష్మీనర్సింహారావు, వెంకటయ్య, నారాయణను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ తేరాల కృష్ణారావు, ప్రమీల, శ్రీనివాస్, గురువులు పాల్గొన్నారు.



1968-69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు

## 'హైరింగ్ సెంటర్' అలంకార ప్రాయం

- ఆసిఫాబాద్‌లో నిరుపయోగంగా మారిన సాగు పరికరాలు అద్దెకిచ్చే కేంద్రం
- నిర్వహణ లోపంతో తుప్పపట్టిపోతున్న వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని కస్టమ్ హైరింగ్ (రైతులకు పరికరాలు-యంత్రాలు అద్దెకిచ్చే కేంద్రం) సెంటర్ అలంకార ప్రాయంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారగా, లక్షలాది రూపాయల విలువైన ట్రాక్టర్‌తో పాటు పరికరాలు తుప్పు పట్టే పరిస్థితి వచ్చింది.

### రూ. 20 లక్షలతో..

సాగులో యాంత్రీకరణ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణాభివృద్ధిశాఖ ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాల ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్ల'(వ్యవసాయ పరికరాలు-యంత్రాల అద్దె కేంద్రాలు)ను ఏర్పాటు చేయించింది. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ధనలక్ష్మి మహిళా సంఘం ద్వారా కూడా ఓ సెంటర్‌ను ప్రారంభించింది. సుమారు రూ. 20 లక్షలతో ట్రాక్టర్‌తో పాటు అన్ని రకాల పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులు తమ అవసరాన్ని బట్టి వాడే పనిముట్లు, యంత్రాలకు ధరలు నిర్ణయించింది. కానీ.. నిర్వహణ లేకపోవడంతో ఈ కేంద్రం అలంకార ప్రాయంగా మారింది. అధికారుల పట్టింపులేని తనంతో పాటు మహిళా సంఘాలకు సరైన అవగాహన లేకపోవడంతో ట్రాక్టర్‌తో పాటు పనిముట్లు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. మహిళా సంఘాలకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు రైతులకు తక్కువ ధరలకే పనిముట్లు అందించాల్సిన కస్టమ్ హైరింగ్ కేంద్రం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# స్పెషల్ రిపీట్




● ఇక ప్రత్యేకం

**పదేళ్ల అనంతరం కాంగ్రెస్ హయాంలోనే ప్రత్యేక అధికారుల పాలన**

*రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించలేదు. కేసీఆర్ ప్రభుత్వం సమయానుకూలంగా ఎన్నికలను నిర్వహించింది. 2018లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చి పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మార్చేసింది. 60 ఏండ్ల పాలనలో జరగని అభివృద్ధిని పదేండ్లలో చేసి చూపించింది. ఇప్పుడు అట్లా కాంగ్రెస్ గెలిచిందో లేదో ఇట్లా ఎన్నికలకు అడ్డుకట్ట వేసింది. ప్రత్యేక పాలన తెచ్చిందంటూ గ్రామాల్లోని నాయకులు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎంపీ ఎన్నికలు ఎప్పుడైపోతాయి.. కులగణన ఎప్పుడు చేస్తారు.. రిజర్వేషన్లపై ఎప్పుడు స్పష్టత వస్తుంది.. ఆరు గ్యారెంటీల అమల్లోకి ఎప్పుడు వస్తాయి.. ఇవన్నీ అయ్యే దాకా ఎన్ని రోజులపాటు ప్రత్యేక అధికారుల పాలన ఉంటుంది. అనే విషయాలపై సందిగ్ధత నెలకొంది.*

- ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్న పాలకవర్గాల గడువు
- ఎన్నికలకు అడ్డుకట్ట.. పెదవి విరుస్తున్న గ్రామాల్లోని నాయకులు
- ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లడానికి జంకు
- అందుకే ఎన్నికల నిర్వహణపై వెనకడుగు వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రత్యేక అధికారుల ఎంపికపై దృష్టిసారించిన అధికార యంత్రాంగం
- రేపో, మాపో ఉత్తర్వులు వెలువడే అవకాశం

**ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీలు**

| జిల్లా | పంచాయతీలు |
|---|---|
| మంచిర్యాల | 311 |
| ఆసిఫాబాద్ | 335 |
| ఆదిలాబాద్ | 468 |
| నిర్మల్ | 396 |



కోటపల్లి మండలం సిర్సా పంచాయతీ కార్యాలయం

మంచిర్యాల, జనవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామ పంచాయతీ(జీపీ)ల్లో ప్రత్యేక పాలనకు రంగం సిద్ధమైంది. పదేళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలోనే పంచాయతీల్లో ప్రత్యేక పాలన ఉండేది. ఇప్పుడు అదే రిపీట్ కానున్నది. జీపీ పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్నది. నిబంధనల ప్రకారం ఇప్పటికే ఎన్నికల నిర్వహణ పూర్తి కావాలి. కానీ.. కొత్త సర్కార్ ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. పంచాయతీరాజ్ కొత్త చట్టాన్ని అనుసరించి పదవీకాలం పూర్తయ్యాక ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. ఇప్పటికిప్పుడు చట్ట సవరణ చేయడం లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం సాధ్యమయ్యే విషయం కాదు. దీంతో ఎలా చూసుకున్నా పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన తప్పేలా లేదు. ఈ మేరకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టిన సర్కారు రెండు, మూడు రోజుల్లో స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులను ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

### రిజర్వేషన్ల హామీ.. ఎంపీ ఎన్నికలు.. ఆరు గ్యారెంటీలు..

ఎన్నికలకు ముందు పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు త్వరలోనే కులగణన చేపడుతామని పేర్కొంది. దీంతో ఈ ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరి అయ్యింది. నూతన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలులో ఉంటాయి. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో ఖరారు చేసిన రిజర్వేషన్ల లెక్క ప్రకారం 2028 వరకు అమలులో ఉండాలి. కానీ.. ప్రస్తుత ప్రభుత్వ ఎన్నికల హామీ మేరకు కుల గణన చేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను నిర్ణయించే వరకు పంచాయతీలకు ఎన్నికలు ఉండేలా లేవు. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు ముందస్తుగా వస్తుండడం, ఫిబ్రవరిలో నోటిఫికేషన్ రానుండడం పంచాయతీ ఎన్నికల వాయిదాకు మరో కారణంగా తెలుస్తున్నది. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఎంపీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. దానికి ముందు ఆరు గ్యారెంటీల అమలుకు అవసరమైన సర్వే పూర్తి చేయించి జనంలోకి వెళ్లాలని వ్యూహరచన చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీలో చర్చ నడుస్తున్నది. గ్యారెంటీలు అమలు చేయకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్తే ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చే చాన్స్ ఉందని పార్టీ అధిష్టానం భావిస్తున్నది. ఈ మేరకు ముందు ఎంపీ ఎన్నికల అనంతరం గ్యారెంటీల అమలు అయ్యాక గానీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా కనిపించడం లేదు.

### మండల స్థాయి అధికారులే ఇన్‌చార్జిలు

గ్రామ పంచాయతీల్లో ఇన్‌చార్జిలుగా మండల స్థాయి అధికారులను నియమించనున్నట్లు తెలుస్తున్నది. లోక్‌సభ విధులతో సంబంధం లేకుండా ఉండే మండల స్థాయిలోని అధికారులను పంచాయతీలకు ఇన్‌చార్జిలుగా నియమించనున్నట్లు సమాచారం. ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, గెజిటెడ్ హోదా ఉన్న ఇతర శాఖల అధికారులకు ఈ బాధ్యతలు అప్పగిస్తారు. ఆయా మండలాల్లోని పంచాయతీల ఆధారంగా ఇతర శాఖల అధికారుల సేవలను ఉపయోగించుకోనున్నారు. చిన్న గ్రామాలైతే రెండు, మూడు గ్రామాలకు ఒకే అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. సాధ్యమైనంత వరకు ఇతర శాఖల అధికారుల అవసరం రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## గంగాజలంతో తిరుగుపయనం

*జిల్లా జన్నారం మండలం కలమడుగు గోదావరి రేవులోని హస్తినమడుగుకు ఆదివారం ఉదయం 200 మందికి పైగా మెస్రం వంశీయులు చేరుకున్నారు. మొదట పుణ్యస్నానం ఆచరించి అక్కడే పిండివంటలు చేసి పితృదేవతలకు నైవేద్యంగా పెట్టారు. అనంతరం నాగోబాకు అభిషేకం చేసేందుకు వారి వెంట తెచ్చుకున్న ఝరిలో గంగాజలాన్ని సేకరించారు. సహపంక్తి భోజనం చేసి తిరుగు పయనమయ్యారు. ఫిబ్రవరి 9వ తేదీకల్లా నాగోబాకు చేరుకొని పవిత్ర గంగాజలంతో అభిషేకం చేసి జాతరను ప్రారంభిస్తామని మెస్రం వంశీయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయ ప్రధాన్ దాదారావ్, కఠోడ, మెస్రం కోసురావు,కొత్వల్ హన్మంతరావు,మెస్రం కోసు, తిరుపతి పాల్గొన్నారు.*

*- జన్నారం, జనవరి 28*



ఝరీకి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



జన్నారం కలమడుగు గోదావరి రేవులో భోజనం చేస్తున్న మెస్రం వంశీయులు



గంగజాలంతో తిరుగు పయనం అయిన మెస్రం వంశీయులు

## తుది దశకు ఓరియంట్ 'గుర్తింపు' ఎన్నికల పక్రియ

**యూనియన్లతో సమావేశం, ఓటరు లిస్ట్ అందజేత**

- 10 రోజుల్లో అభ్యంతరాలపై దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో షెడ్యూల్ విడుదల చేసే అవకాశం

కాసిపేట, జనవరి 28 : మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఏర్పాట్లు తుది దశకు చేరుతున్నాయి. ఈ మేరకు ఆదిలాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దేవాపూర్ ఓరియంట్ కంపెనీకి సంబంధించి ప్రధాన ఐదు యూనియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ఉద్యోగుల ఓటరు లిస్ట్‌ను యూనియన్లకు అందించారు. మొత్తం 270 మందితో కూడిన ఓటరు జాబితాను యూనియన్లకు అందించారు. 10 రోజుల్లో ఓటరు లిస్ట్‌పై అభ్యంతరాలుంటే దరఖాస్తులు అందించాలని యూనియన్లకు సూచించారు. ఓటరు లిస్ట్ ఫైనల్ చేసిన తర్వాత సమావేశం నిర్వహించి యూనియన్ల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేసే అవకాశముంది. ఓరియంట్ కంపెనీకి సంబంధించి మొత్తం 10 యూనియన్లు ఉండగా, పోటీలో ఉండే ఐదు యూనియన్లు సమావేశంలో పాల్గొన్నాయి. ఇప్పటి వరకు నిర్వహించిన రెండు సమావేశాల్లో అన్ని అంశాలు చర్చించి.. శనివారం నిర్వహించిన మూడో సమావేశంలో ఓటరు లిస్ట్‌ను అందించారు. ఓటరు లిస్ట్ అభ్యంతరాలను పూర్తి చేశాక, ఫైనల్ చేసి ఎన్నికలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు ఏనుగు తిరుపతిరెడ్డి, సత్యపాల్‌రావు, సతీశ్ రెడ్డి, భీంరావు, సూరు పాల్గొన్నారు.




దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ (ఫైల్)

## ఇంటింటికీ తాగునీరిచ్చిన ఘనత మాదే

- కేసీఆర్ సర్కారు ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి పనులు
- హామీలు నెరవేర్చకుండా కాలయాపన తగదు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల అర్బన్, జనవరి 28 : ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశానని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరందించిన ఘనత కేసీఆర్ సర్కారుదేనని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సర్కారులో మంజూరైన నిధులతోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును గౌరవించామన్నారు. సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. గూడెం ఎత్తిపోథల పథకం నిర్మించి యేటా రెండు పంటలకు సాగు నీరందించామని, వర్షాలకు సామగ్రి పాడైపోతే రూ. 11 కోట్లతో మరమ్మతులు చేయించింది తెలంగాణ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తిలక్ నగర్ రోడ్డు పనులకు కూడా కేసీఆర్ సర్కారు ఇచ్చిన నిధులేనన్నారు. మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట మూడు మున్సిపాలిటీలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద రూ. 75 కోట్లు మంజూరు చేశామన్నారు. మంచిర్యాల-అంతర్గాం గ్రామాల మధ్య గోదావరి నదిపై బ్రిడ్జి పనులు ఎందుకు ఆపారో చెప్పాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

### రుణమాఫీ, రైతుబంధుపై కాలయాపన

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా రైతు రుణమాఫీ చేయలేదని, రైతుబంధు నిధులు విడుదల కాలేదని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే రైతుబంధు, రుణమాఫీపై రైతులకు ఎలాంటి ధైర్యాన్ని ఇవ్వలేకపోతున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

## 'పది' పరీక్షల్లో ఒత్తిడికి లోనుకావద్దు

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఉప సంచాలకుడు రవీందర్‌రెడ్డి**

మంచిర్యాల అర్బన్, జనవరి 28 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో రాయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఉప సంచాలకుడు రవీందర్ రెడ్డి అన్నారు. వివేకావర్ధిని డిగ్రీ కళాశాలలో ఆదివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన 'ప్రేరణ - అవగాహన తరగతులు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లు చేయవద్దని, పరీక్షలకు సంబంధించి సందేహాలుంటే ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పరీక్షలకు సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం నిపుణులతో ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారి రవీందర్, వసతి గృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీందర్ రెడ్డి

## టీఎన్జీవో చెన్నూర్, లక్షెట్టిపేట యూనిట్‌ల ఎన్నికలు



చెన్నూర్: ఎన్నికైన సభ్యులతో టీఎన్జీవో నాయకులు

చెన్నూర్, జనవరి 28 : టీఎన్జీవో చెన్నూర్ యూనిట్ నూతన కమిటీకి ఆదివారం ఎన్నికలు జరిగాయి. టీఎన్జీవో చెన్నూర్ యూనిట్ అధ్యక్షుడిగా మామిడి రాజన్న, ఉపాధ్యక్షుడిగా ఎస్ స్వామిదాస్, ప్రధాన కార్యదర్శిగా కుమురం అభిషేక్, సంయుక్త కార్యదర్శిగా పీ రజిత, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎండీ నవీద్ అహ్మద్, కోశాధికారిగా ఏ సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా పీ సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా సయ్యద్ సబీర్, ఎం విజయ, మానసలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు టీఎన్జీవో రాష్ట్ర నాయకుడు పొన్న మల్లయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని టీఎన్జీవో జిల్లా నాయకులు గడియారం శ్రీహరి, టీఎన్జీవో నాయకులు శాలువాలతో సన్మానించారు.

లక్షెట్టిపేట, జనవరి 28 : పట్టణంలోని ఎంపీడీవో మీటింగ్ హాలులో టీఎన్జీవో లక్షెట్టిపేట యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. నూతన అధ్యక్షుడిగా చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా భూమన్న, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీగా వెంటకేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సమీమొద్దీన్, ప్రచారకార్యదర్శిగా రామకృష్ణ, సభ్యులుగా వాణి, గోవర్ధన్‌రెడ్డితో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. ఒక్కో నామినేషన్ రావడంతో జిల్లా ఎన్నికల అధికారి నితీష్‌కుమార్ ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాంమోహన్, అసోసియేట్ అధ్యక్షుడు సీపతిబాబు, నాయకులు మల్లయ్య, శ్రావణ్‌కుమార్, అంజయ్య, రవికిరణ్, రాంకుమార్ పాల్గొన్నారు



లక్షెట్టిపేట : కొత్తగాఎన్నికైన వారితో టీఎన్జీవో నాయకులు